
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 అనంతపురం జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025




ఆప్షన్ ఫాం ఇవ్వడానికి డీపీఓ కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు (ఫైల్)

కోరుకొన్న ప్లేస్..!

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీఓ)లో బదిలీల్లో వసూళ్ల పర్వానికి తెరలేపారు. కోరుకున్న స్థానం కావాలంటే లక్షల రూపాయలు ఇచ్చుకోవాల్సిందే. అది కూడా (మిగతా 6లో..)

డీపీఓలో వసూళ్ల పర్వం
- బదిలీల్లో దగ్గరి స్థానాలకు లక్షల్లో వసూలు
- ఎక్కువ ఇచ్చుకున్న వారికే అవకాశం
- ఇద్దరు డిజిటల్ అసిసెంట్ల బరితెగింపు
- ఉన్నతాధికారుల మౌనంపై విమర్శలు


పండమేరు వంకలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


జై గణేష్...


గంగ ఒడికి వెళ్లి రా.. సామీ

వీడ్కోలు స్వామీ...!

అనంతపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు వినాయక విగ్రహాలతోపాటు పల్లెల్లో ఏర్పాటు చేసిన వాటిని మూడు రోజు శుక్రవారం నిమజ్జనం గావించారు. సాయంత్రం గణేష్ మండపాల వద్ద పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ తుదిపూజలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ భక్తితన్మయులై ఊరేగింపు ముందు డ్రమ్స్ వాయిద్యాల నడుమ ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ సాగారు. పురవీధుల్లో వినాయకుడిని ఊరేగించిన అనంతరం ఆయా ప్రాంతాల్లో నిమజ్జనాలు చేశారు. జిల్లా కేంద్రంలో చెరువుకట్ట, రాప్తాడు వద్ద గల పండమేరు వంక తదితర ప్రాంతాల్లో బొజ్జ గణపయ్యలను నిమజ్జనం గావించి, వీడ్కోలు పలికారు.

రాప్తాడులో సందడే సందడి..



గోపాలకులకు పట్టదా..?

- నగర రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఆవులకు అనారోగ్యం
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు


క్లాక్‌టవర్ వద్ద జనం వాహనాల మధ్యలో వెళ్తున్న ఆవులు



అనంతపురం నగర శివారు ఇంద్రజిత్‌నగర్ నివాసం ఉండే పాండు(41) తన కూతురుకు ఇడ్లీ, జ్వరం మందులు తేవడానికి ఈ నెల 22న ఉదయం బైకుపై బయటకు వచ్చారు. హోటల్‌కు వెళ్తున్న క్రమంలో కళ్యాణదుర్గం రోడ్డు నరిగమ్మ గుడికి సమీపంలో ఆవుల గుంపు అతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి... నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, బతికే అవకాశాలు లేవని చెప్పడంతో అదే రోజు అర్ధరాత్రి అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ శుక్రవారం, శనివారం చికిత్స అందించారు. కోలుకోలేక ఆయన ఈ నెల 24న మృతి చెందారు. పాండు భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పాండు నగరంలోని సుభాష్‌రోడ్డులో వాచ్ మెకానిక్‌గా పనిచేసేవారు. కొన్నేళ్లుగా ఇదే వారికి జీవనోపాధి. ఆయనకు కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో దిక్కులేనివారయ్యారు. నగరంలో పశువులు ఎంత ప్రమాదకరంగా మారాయో చెప్పేందుకు ఈ విషాద ఘటన ఓ ఉదాహరణ.

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగర రోడ్లపై పశు సంచారం యథేచ్ఛగా సాగుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు, తోపుడు బండ్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళ్ల ముందే కదిలే స్పీడ్ బ్రేకర్లు కనిపిస్తున్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు కనిపిస్తున్నారు. నగరంలో సుమారు మూడు వేలకు పైగా ఆవులు రోడ్లపై తిరుగుతూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. పలు సందర్భాల్లో వీటిని ఢీకొని అనేకమంది ద్విచక్రవాహనదారులు తీవ్రంగా గాయపడి, మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అలాగే రోడ్లపై తోళ్లు, తొక్కలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ ఆవులు అనారోగ్యం పాలవుతున్నాయి. పెద్ద వాహనాలు ఢీకొట్టిన సమయంలో మృత్యువాత పడుతున్నాయి.

ప్రమాదాలు ఇలా..

ఇటీవల నగరంలో జేఎన్‌టీయూ వైపు బైకుపై వెళ్తున్న తల్లి, కూతుళ్లు ఆవు అడ్డం రావడంతో కింద పడి గాయపడ్డారు. అలాగే హౌసింగ్‌బోర్డులో బైకుపై వెళ్తున్న భార్యభర్తలకు విద్యుత్తునగర్ మెయిన్‌రోడ్డులో ఆవు అడ్డు రావడంతో కింద జారి పడ్డారు. మారుతీ నగర్, రామచంద్రనగర్, పాతూరు ఎన్టీఆర్ మార్గ్ భవానీనగర్, తిలక్‌రోడ్డు, సంగమేష్ సర్కిళ్లలో అనేక ప్రమాదాలు జరిగాయి. నగరంలో పలు ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న చిన్నారును ఆవులు పొడిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ ఘటనలపై ఎంతో మంది బాధితులు కార్పొరేషన్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోతున్నారు.


గుత్తిరోడ్డులో ఆవుల సంచారం

త్వరలో నిర్ణయం: రంగస్వామి, ఎంహెచ్ఓ, అనంత నగరపాలక సంస్థ



నగరంలో ఆవుల సమస్య అధికంగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. పలు ఘటనలలో బాధితులు నేరుగా వచ్చి ఆవుల సమస్య పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ఆవులు నగరంలో సరైన మేత లేక ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తిని అనారోగ్యంతో మృతి చెందినట్లు చెబుతున్నారు. గతంలో నేను ప్రొద్దుటూరులో పనిచేసిన సమయంలో పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా రైతులకు ఆవులు పట్టించి సమస్యను పరిష్కరించాం. త్వరలో ఏఎంసీ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులతో చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటాం.

పరిటాల రవికి మరణం లేదు

- ఆయన ఆశయాలను శ్రీరామ్, సిద్ధార్థ కొనసాగిస్తున్నారు
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- టీడీపీ రామగిరి కార్యాలయంలో ఎన్టీఆర్, రవి విగ్రహాల ఆవిష్కరణ

6


పరిటాల రవీంద్ర విగ్రహోష్కరణలో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

వారికీ పింఛన్..!

- అనర్హమైనవిగా తేల్చిన 9,601 పింఛన్లలో 7,399 మందికి 1న సొమ్ము
- మిగిలిన 2,202 మందికి అప్పీలుకు అవకాశం
- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో అనర్హమైనవిగా తేల్చిన 9,601 పింఛన్లలో 7,399 మందికి 1వ తేదీ పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మొత్తం 2,80,471 పింఛన్లు ఉన్నాయన్నారు. ఇందులో వికలాంగుల పింఛన్లు 47,673 ఉన్నాయన్నారు. పునఃపరిశీలనలో 9,610 అనర్హమైనవిగా గుర్తించారన్నారు. వీటిలో 7,399 పింఛన్లు కొనసాగిస్తామన్నారు. మిగిలిన 2,202 పింఛన్లకు సంబంధించి లబ్ధిదారులకు అప్పీలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వీరంతా సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో అప్పీలు చేసుకోవచ్చన్నారు. శనివాంరం సాయంత్రం 5గంటల్లోపు అప్పీలుచేసిన అందరికీ సెప్టెంబరు 1న పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆత్మారాం, డీఐహెచ్ఎస్ డేవిడ్, డీఆర్‌డీఏ పీడీ రాధారాణి పాల్గొన్నారు.

ఓరి.. నాయనో..!

- మూడు రోజులైనా పూర్తిస్థాయిలో రాని డీఎస్సీ ఎంపిక జాబితా
- 50మందికిరాని మెసేజ్‌లు
- కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

7

అధికారులు నా మాట వినటం లేదు

- మున్సిపల్ చైర్‌పర్సన్ కంటతడి


కంటతడి పెడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధికారులు తన మాట వినడం లేదని, ఒక్కపనీ చేయడం లేదని మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని కన్నీటిపర్యంతమయ్యారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముందుగా టీడీపీ కౌన్సిలర్ షరీఫ్ మృతికి సంతాపం తెలియజేశారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డులోని సమస్యలు పరిష్కారం కావడంలేదని, టెండరు పూర్తయినా పనులు చేయడం లేదంటూ సభ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లు చెప్పిన పనులు చేయాలంటూ తాను అధికారులకు సూచించినా వారు పట్టించుకోవడం లేదని చెబుతూ భావోద్వేగానికి గురైన చైర్‌పర్సన్ భవాని కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు కృపాకర్, పవన్‌కుమార్ గౌడ్, ఉడుదాల ప్రభాకర్ మాట్లాడుతూ కౌన్సిల్ ఏర్పడి 54 నెలలైనా వార్డులో పనులు జరగడం లేదన్నారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో వర్కుల కోసం టెండర్లను పిలుస్తున్నారు కానీ, కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. కుక్కల బెడద ఉందని, ఆవుల సంచారంపై చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్ వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో లక్షలు విలువ చేసే మోటార్‌ను ఎత్తుకెళ్లినా వాటి మీద ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ లింగన్న పేర్కొన్నారు. పక్కీరప్ప కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, శ్మశాన వాటికకు వెళ్లే దారిలో ముళ్లకంపలను తొలగించాలని టీడీపీ కౌన్సిలర్ మెహరున్నీసా కోరారు. అనంతరం ఆజెండాలోని అంశాలను ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయ్యూం అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, ఎంఈ ఇంతియాజ్, టీడీపీ కౌన్సిలర్లు అనురాధ, విద్యారాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

6

నేడు బార్ లాటరీ
- అనంతలో 19కిగానూ పదింటికే దరఖాస్తులు
- శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లలో ఏడింటికే ఆసక్తి
- కలెక్టర్ల సమక్షంలో లక్కీడ్రా ద్వారా కేటాయింపులు

6

'పారా' కోర్సులతో మెండైన ఉపాధి
- రెండేళ్ల డిప్లొమాతో అవకాశం
- కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్

(వివరాలు 7వ పేజీలో...)



మనం టాప్‌లో ఉండాలి

- అన్న క్యాంటీన్లు, మున్సిపాలిటీలలో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి
- వీసీలో కలెక్టర్ వినోద్‌కుమార్


వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లు, మున్సిపాలిటీలలో పరిశుభ్రత, ఇతర అంశాల్లో రాష్ట్రంలో టాప్-6లో జిల్లా ఉండేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన పింఛన్లు, అన్న క్యాంటీన్లు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్యం, ఇరిగేషన్, ఐసీడీఎస్, యూరియా, విద్యుత్ శాఖ, ఏపీఐఐసీ భూ సమస్యలు తదితర అంశాలపై జేసీ, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్న క్యాంటీన్ల అమలులో రాష్ట్రంలో జిల్లాకు నాలుగో స్థానం దక్కడంపై మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ అభినందించారు. మున్సిపాలిటీలలో చెత్త సేకరణ, డ్రైనేజీల శుభ్రం తదితర అంశాలపై మరింత పురోగతి చూపాలని వారిని ఆదేశించారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ పూర్తికి అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న 304 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, చెరువులు నింపేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల న్నారు. వచ్చే వారం రోజుల్లో 50 చెరువులు నింపేలా చూడాలని మైనర్ ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. రైతు సేవ కేంద్రాలు, ప్రైవేట్ కేంద్రాల్లో ఎరువుల అమ్మకాలపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు మానిటర్ చేయాలన్నారు. అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పీఎం కుసుమ్ కింద 111 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం అవసరమైన 499.5 ఎకరాల భూమిని సేకరించాలని ఆదేశించారు. ఆర్డీఓలు వారి పరిధిలో సబ్‌స్టేషన్లు తనిఖీ చేయాలని, వారం రోజుల్లో భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏపీఎస్పీసీఎల్ పరిధిలో అల్ట్రా మెగా సోలార్ పార్క్ కోసం అవసరమైన భూమిని సేకరించాలన్నారు. గుంతకల్లు, శింగనమల, రాయదుర్గం నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల కోసం ఒక్కో చోట 50 ఎకరాల భూమిని గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు.





అనంతపురంలోని రామ్‌నగర్ పాత కోకోకోలా గోడౌన్ వద్ద చావా గణపతి



నీరుగంటి వీధి 3వ క్రాస్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వినాయకుడు



రెండో రోడ్డులో పూరీ జగన్నాథుడి రూపంలో గణనాథుడు



రామ్‌నగర్ రేణుకా యల్లమ్మ ఆలయం వద్ద రాధాకృష్ణ గణపతి



మొదటిరోడ్డు శివాలయం వద్ద ఆపరేషన్ సిందూర్ గణపతి



పాతూరు రేణుకా యల్లమ్మ ఆలయం వద్ద సోదరి అశోక సుందరిని ఆడిస్తున్న వినాయకుడు

ఆధ్యాత్మిక శోభ

- విఘ్నపతికి మూడోరోజు విశేష పూజలు

అనంతపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడవరోజున వాడవాడలా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. గ్రామాలు మొదలుకొని జిల్లా కేంద్రం వరకూ అన్ని ప్రాంతాల్లోనూ కొలువుదీరిన గణపయ్యలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శుక్రవారం గజాననుడి మండపాలన్నింటిలోనూ స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, రకరకాల పుష్పాలంకరణలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు అందరూ గణనాథుని ముందు గుంజిళ్లు తీసి, నైవేద్యాలు సమర్పించి తమ కష్టాలు తొలగించి సుఖాలు ప్రసాదించాలంటూ మొక్కులు తీర్చుకున్నారు.

ఈ సందర్భంగా విభిన్న రూపాల్లో పార్వతీ తనయుడు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలుప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పరిటాల రవికి మరణం లేదు

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



రామగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్రకు మరణం లేదని, ఆయన ఆశయాలను పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ ముందుకు తీసుకువెళుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పరిటాల రవీంద్ర అందరి గుండెల్లో బతికే ఉన్నారని అన్నారు. రామగిరిలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాలను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది అభిమానులు తరలివచ్చారు. ముందుగా మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిటాల రవి ఆశయాలు ఎంతో గొప్పవని అన్నారు. ఎంతో మంది అన్నదాతలకు అండగా నిలిచారని, పేదింటి ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేశారని, రక్తదానం చేయించారని అన్నారు. ఆయన గురించి కొందరు విమర్శలు చేయడం వారి కుసంస్కారానికి నిదర్శనమని అన్నారు.



రక్త దాతలతో ఎమ్మెల్యే పరిటాల సునీత

కట్టె కాలేవరకూ ఇక్కడే..

పరిటాల రవికి దేవుడిచ్చిన తండ్రి ఎన్టీఆర్ అని పరిటాలశ్రీరామ్ అన్నారు. పరిటాల రవీంద్రను కొండపల్లి సీతారామయ్య, ఎన్టీఆర్ ముందుండి నడిపించారని అన్నారు. ఆయన కుమారుడిగా పుట్టడం గర్వంగా ఉందని అన్నారు. తమ కట్టె కాలేవరకు టీడీపీలోనే పనిచేస్తామని, సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌ల కోసం నిలబడతామని అన్నారు. తండ్రి ప్రేమ తనకు చిన్నతనంలోనే దూరమైందని, కానీ వేలాది మంది అభిమానులను తమ కుటుంబానికి ఆయన అందించారని అన్నారు. తమను ముందుండి నడిపిస్తున్న అభిమానులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. పరిటాల రవి పిలుపు ఇచ్చిన రక్తదానం నేటికి నిర్విరామంగా కొనసాగుతోందని అన్నారు.

రక్తదాన శిబిరం

పరిటాల రవీంద్ర మెమోరీయల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, అనంతపురం, హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వెయ్యి మందికి పైగా అభిమానులు రక్తదానం చేశారు. రక్త దాతలను పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, జ్ఞాన, తేజస్విని పలకరించి, జ్ఞాపికలను అందజేశారు. బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 980 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు, కంటి అద్దాలను ఉచితంగా పంపిణీచేశారు.



కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

నేడు పెనుకొండలో..

పెనుకొండ టౌన్: పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాన్ని పెనుకొండలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శనివారం ఆవిష్కరిస్తారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులకు మంత్రి పిలుపునిచ్చారు. పెనుకొండ దర్గా సర్కిల్‌లో శనివారం ఉదయం 9గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలిపారు.

సార్.. చేతులెత్తి మొక్కుతాం.. న్యాయం చేయండి

- తూనికలు, కొలతలు అధికారికి రైతుల విన్నపం



చేతులు జోడించి అధికారులకు మొక్కుతున్న రైతు

విడపనకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'సార్..! మీకు చేతులెత్తి మొక్కుతాం. మాకు న్యాయం చేయండి. మేం పండించిన పంటలను వ్యాపారులు, దళారులు న్యాయంగా కొనేలా చర్యలు తీసుకోండి' అంటూ తూనికలు కొలతలు అధికారి శంకర్‌ను మండలంలోని పాల్తూరు రైతులు కోరారు. గ్రామంలో వేరుశనగ తూకాల్లో బాదు పేరిట జరుగుతున్న మోసంపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ తూనికలు కొలతల శాఖ అధికారులను పాల్తూరు గ్రామానికి పంపారు. దీంతో తూనికలు కొలతలశాఖ అధికారులు శుక్రవారం ఉదయం పాల్తూరు గ్రామం చేరుకుని రైతులతో చర్చించారు. వ్యాపారులను పిలిపించి ఎక్కడైనా సరే 40 కిలోల బస్తాకు 2 కిలోలకు మించి బాదును తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మారయ్య పొలంలో ఓ వ్యాపారి 43.5 కిలోల తూకం పట్టిన విషయాన్ని గమనించిన అధికారి తిరిగి వాటిని 42 కిలోలకు మార్పించారు. వేరుశనగ కాయలు వేస్తున్న ఖాళీ బ్యాగులు ఉల్లిగడ్డలు వేసే బ్యాగులు కావటంతో కనీసం 10 గ్రాములు కూడా లేని సంచికి అరకిలో బాదు తీయటం ఏంటి అని వ్యాపారులను ప్రశ్నించారు. రైతుల పొలాలు వద్దకే తూనికలు కొలతలశాఖ అధికారులు వెళ్లి ఏ వ్యాపారి వచ్చినా 42కిలోలకు కిలో కూడా ఎక్కువ ఇవ్వద్దు అని సూచించారు. ఎవరైనా అధికంగా డిమాండ్ చేస్తే తమకు ఫోన్ చేయమని నంబర్లను ఇచ్చారు. 'వర్షాలు పడుతున్నాయి. పొలాల్లోనే రాశులు వేసుకున్నాము. దిగుబడి తడిస్తే నష్టపోతాము. ప్రభుత్వం తరఫున వేరుశనగ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోండి' అంటూ పలువురు రైతులు వేడుకున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలోని 22ఏ, చుక్కల భూములను తొలగించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశాన్ని జేసీ శివనారాయణ శర్మతో కలిసి శుక్రవారం నిర్వహించారు. చుక్కల భూములకు సంబంధించి 15 క్లెయిమ్స్‌ను విచారించారు. అందులో తొమ్మిదింటిని ఆమోదించి, ఆరింటిని తిరస్కరించారు. 22ఏకు సంబంధించి 25 క్లెయిమ్స్‌ను విచారించారు. అందులో రెండింటిని ఆమోదించి, 17 దరఖాస్తులను తిరస్కరించారు. ఆరింటిని పునఃపరిశీలనకు పంపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి 22ఏ కేసులను శనివారం విచారిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంపై పోలీసు నిఘా



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ విగ్రహాల నిమజ్జనంపై పోలీసు నిఘా పెట్టారు. నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా నిఘా ఉంచినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిమజ్జనంపై డ్రోన్లతో నిఘా పెట్టి, ఎప్పటికప్పుడు పోలీసులను అప్రమత్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాచానపల్లి, పంపనూరు సమీపంలో వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేఖర్, పీఎస్‌ఐ సాయి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

అనంతపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుభాషకు ప్రపంచవ్యాప్తంగా వన్నెతెచ్చిన గిడుగు రామమూర్తితోపాటు తెలుగుతల్లికి పలువురు సాహితీవేత్తలు పూలమాలలు వేసి, వేడుకలు చేసుకున్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులతో కలిసి రాజ్యమహిళా సమ్మాన్ అవార్డు గ్రహీత డాక్టర్ నల్లాని రాజేశ్వరి ఎస్పీ బంగ్లా సమీపంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఆమె మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు మూలపురుషుడన్నారు. ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు గిడుగు ఉద్యమం వల్ల వ్యవహారిక భాషలో అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి గిడుగు కృషి కారణంగా సృజనాత్మకత ఉన్న ప్రతి ఒక్కరికీ అబ్బిందని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమనాయుడు, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, తెలుగుశాఖ అధ్యక్షుడు నగరూరు రసూల్ పాల్గొన్నారు.

తెలుగుభాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో...

తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ నారాయణ అధ్యక్షతన కేఎస్ఆర్ ఉన్నత పాఠశాల నుంచి ఎస్పీ కార్యాలయం వద్ద గల తెలుగుతల్లి విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, 'జై తెలుగుతల్లి... తెలుగు భాష వర్ధిల్లాలి' అంటూ నినదించారు. తెలుగుభాష గొప్పదనాన్ని గురించి స్మరించుకున్నారు. కార్యక్రమంలో గుడిపాటి సూర్యం, కేఎస్ఆర్ పాఠశాల టీచర్లు శ్రావ్య, విజయ, లత, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిరసం ఆధ్వర్యంలో...

జిల్లా రచయితల సంఘం (జిరసం) ఆధ్వర్యంలో సాహితీకారులు తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేయడంతోపాటు తెలుగు భాష ఔనత్యాన్ని, మాధుర్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శి కోటిగారి వన్నప్ప, ఉపాధ్యక్షుడు గోసల నారాయణస్వామి, కార్యదర్శి చేగువేరా హరి, గుడిపాటి సూర్యనారాయణ, ఒంటెద్దు రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తున్న ఎస్ఎస్‌బీఎన్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

యువకుడి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

కూడేరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌సీసీ నగర్ సమీపాన యువకుడు అనిల్‌కుమార్ (23) శుక్రవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన సరస్వతి, నారాయణ దంపతుల కుమారుడు అనిల్ కుమార్ కియ కంపెనీలో పనిచేస్తుండేవాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్ ముత్యాల రెడ్డి వెంచర్ వద్ద చీరతో చెట్టుకు ఉరేసుకున్నాడు. పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అనంతపురం వైద్యం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య (ఫిజికల్ ఫిట్‌నెస్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. దాదాపు 480మంది అభ్యర్థులను గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు పరీక్షించనున్నారు. ఆర్థోపెడిక్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చందన, రాఘవేంద్రరాజు, చైతన్య, ఆప్తాలమిక్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మానస, భవాని శంకర్, జనరల్ సర్జన్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్లు నారాయణ, శివశంకర్ నాయక్, రమాబాయి, ఉజ్జినేశ్వరి, జనరల్ మెడిసిన్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ బుచ్చయ్య, ఎస్ఆర్‌లు మహతీష్, శ్వేత శుక్రవారం నాటికి 300మందికిపైగా పరీక్షలు నిర్వహించారు. మిగిలిన అభ్యర్థులను శనివారం పరీక్షించనున్నారు.

నాటుసారా రహిత జిల్లాగా అనంత

కలెక్టర్ వినోద్‌కుమార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎక్సైజ్ శాఖ అధికారులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత జిల్లాగా అనంతను ప్రకటించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎక్సైజ్ శాఖ పరిధిలో నవోదయం 2.0పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 104 గ్రామాలను నాటుసారా రహితమైనవిగా ప్రకటించామన్నారు. నాటుసారా నిర్మూలనకు ఎప్పటికప్పుడు దాడులు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నవోదయం 2.0పై ఎక్సైజ్ శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, సీఐలు సత్యనారాయణ, సునీల్, సాగర్, సోమశేఖర్, సునీత, జయనాథరెడ్డి, ఎస్ఐ జాకీర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీ జగదీష్‌తో కలిసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతపురం నగరంలో ఎన్ని పార్కింగ్ ప్రాంతాలు అవసరమవుతాయో గుర్తించాలన్నారు. జిల్లాలో గంజాయిని అరికట్టాలన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లు, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ... గుత్తి-గుంతకల్లు రహదారిలో అవసరమైనచోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రేడియం స్టిక్కర్ వేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో వారానికోసారి 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి తెలియజేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరుకొన్న ప్లేస్..!

(5వ పేజీ తరువాయి)



ఎవరు ఎక్కువగా ఇచ్చుకుంటే వారికే అవకాశం కల్పిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసులు ఇచ్చుకోకుంటే ఆప్షన్ ఫాం ఇచ్చి వారాలు గడుస్తున్నా.. ఆర్డర్లు అందట్లేదని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. డీపీఓలో పనిచేస్తున్న ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు వసూళ్ల పర్వం సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ ఆర్డర్లు ఇవ్వడంలో జాప్యం చేయడం ద్వారా దగ్గరి స్థానాలకు మరింత రేటు పలికేలా చక్రం తిప్పుతున్నారని తెలుస్తోంది. దగ్గరి స్థానం అడిగిన వారితో బేరసారాలకు దిగుతున్నారు. ఎవరు ఎక్కువగా ఇచ్చుకుంటే వారికే ఖరారవుతుంది. ఒకరికి మాట ఇచ్చిన తరువాత కూడా మరొకరు అంతకన్నా ఎక్కువగా ఇచ్చుకుంటామంటే మళ్లీ మార్చేశారు. ఇలా.. వేలం పాట తరహాలో వసూళ్ల బేరాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ముడుపులు ముట్టజెప్పాల్సిందే..

గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లు మొదలుకుని గ్రేడ్-1 కార్యదర్శి నుంచి డిప్యూటీ ఎంపీడీఓ ప్లేస్‌మెంట్ కావాలన్నా, గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 ఉద్యోగోన్నతుల్లో భాగంగా దగ్గరగా ఉండే మేజర్ పంచాయతీ కావాలన్నా అందుకు తగ్గట్టుగానే ముడుపులు ముట్టజెప్పాలన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ పోస్టింగ్‌ల కంటే డెప్యుటేషన్, ఇన్‌చార్జి బాధ్యతలైతే మరింత ధరలు పలుకుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. 8 ఏళ్లుగా ఉద్యోగోన్నతులు కల్పించలేదు. కొందరైతే సర్వీస్‌లో చేరిన 20 ఏళ్ల తరువాత ఉద్యోగోన్నతి కల్పిస్తున్నారు. దీనిని డీపీఓలో పనిచేస్తున్న ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్ల సొమ్ము చేసుకుంటున్నారు. ఆశావహుల నుంచి ముక్కుపిండి లక్షల్లోనే వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగోన్నతులు కల్పించి ప్లేస్‌మెంట్ల కోసం ఆప్షన్ ఫాం తీసుకుని, 10 రోజులైనా ఇప్పటికీ ప్లేస్‌మెంట్లు మాత్రం ఖరారు చేయలేదు. ఎంత లేటు అయితే అంత డిమాండ్ పెరుగుతుందన్న ఉద్దేశంతోనే కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ముట్టజెప్పిన వారు ఏమిటి ఇంకా ఆలస్యం అని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటే.. ఇంకొంచెం ఎక్కువ ఇస్తామనీ, ఆ సీటు తమకివ్వాలంటూ మరికొందరు క్యూ కడుతున్నారని తెలుస్తోంది. వసూళ్ల తంతు పబ్లిక్‌గానే సాగుతున్నా డీపీఓ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సీనియర్ల పేర్లేవీ?

గ్రేడ్-4 కార్యదర్శులకు రోస్టర్‌కు అనుగుణంగా ఉద్యోగోన్నతులు కల్పించారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్ సిబ్బందికి సీనియార్టీ జాబితాలో చోటు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. బాధితులు.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళితే.. ఓ డిజిటల్ అసిస్టెంట్ మధ్యవర్తిత్వానికి యత్నించినట్లు తెలిసింది. డీపీఓగా నాగరాజనాయుడు కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. కార్యాలయంలో పనిచేసే వారిని కాదని ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లను సీసీలుగా నియమించుకుని, దందాలకు తెరలేపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరి సీసీలకు మరో ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు సహాయకులుగా డీపీఓ కార్యాలయంలోనే పాగా వేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నా.. అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నా.. వారిని మార్చకపోవడంలో అంతర్యం ఏమిటన్నది అంతుచిక్కడం లేదు. సీసీలుగా నియమించుకున్న డిజిటల్ అసిసెంట్ల స్థానాల్లో ఇతరులనూ నియమించలేదు. దీంతో ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు బార్ లాటరీ

అనంతలో 19కిగానూ పదింటికే దరఖాస్తులు

శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లలో ఏడింటికే..

కలెక్టర్ల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా కేటాయింపులు

అనంతపురం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బార్ లైసెన్సుల కేటాయింపునకు శనివారం లక్కీ డ్రా తీయనున్నారు. రెండు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. అనంతపురం జిల్లాలో 19 బార్లకుగానూ పదింటికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిది బార్లకు ఒక్క దరఖాస్తూ రాలేదు. రెండు గీత కులాల బార్లకు కూడా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు శుక్రవారం ముగిసింది. పది బార్లకు 40, రెండు గీత కులాల బార్లకు 10 కలిపి మొత్తం 50 దరఖాస్తులు వచ్చాయి. జడ్పీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం లక్కీ డ్రా తీయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లకు దరఖాస్తులు పిలవగా ఐదింటికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. హిందూపురం మున్సిపాలిటీలో నాలుగు బార్లకుపిలవగా, మూటింటికి 19 దరఖాస్తులు వచ్చాయి. కదిరిలో మూడు బార్లకుగానూ రెండింటికి 8 దరఖాస్తులు వచ్చాయి. ధర్మవరంలో మూటింటికి గానూ ఒక్క బార్‌కు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. పెనుకొండలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వచ్చాయి. మడకశిరలో ఒకే బార్ కాగా.. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. హిందూపురంలో గీత కులాలకు కేటాయించిన బార్ అండ్ రెస్టారెంట్‌కు 11 దరఖాస్తులు వచ్చాయి. దీనికి దరఖాస్తు ఫీజు తక్కువ కావడంతో పోటీ పడ్డారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శనివారం ఉదయం 9 గంటలకు లాటరీ తీస్తారు. లైసెన్స్ దక్కించుకున్నవారు 15 రోజుల్లోపు బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన యువతి నారాయణమ్మ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రవి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె నారాయణమ్మ గురువారం నుంచి కనిపించడం లేదు. నారాయణమ్మ కోసం తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. తమ కుమార్తె అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

నిమజ్జనానికి లోతు చూద్దామని..

● చిత్రావతి నదిలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి


హేమంత్‌కుమార్ మృతదేహం

బత్తలపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి చిత్రావతి నది లోతు చూసేందుకు ప్రయత్నించిన బీటెక్ విద్యార్థి అందులో మునిగి మరణించాడు. మండలంలోని సంగమేశ్వరం వద్ద శుక్రవారం చిత్రవతి నదిలో మునిగి బీటెక్ విద్యార్థి హేమంత్ కుమార్ (23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాసులుకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు హేమత్‌కుమార్ బీటెక్ ఫైనలియర్ చదువుతుండేవాడు. హేమంత్ కుమార్.. మిత్రులతో కలిసి కాలనీలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిమను శనివారం నిమజ్జనం చేయాలనున్నారు. సంగమేశ్వరంవద్ద చిత్రావతి నది లోతును పరిశీలించేందుకు మిత్రులతో కలసి హేమంత్ కుమార్ దిగాడు. లోతును పరిశీలిస్తూ కొద్దిదూరం వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగి పోశాగాడు. గట్టిగా కేకలు వేశాడు. వెంటనే మిత్రులు తమ టీషర్టులను కలిపి, కాపాడే ప్రయత్నం చేశారు. అయినా హేమంత్ మునిగిపోయాడు. చుటుపక్కల వారి సాయంతో హేమంత్‌కుమార్‌ను బయటకు తీసి, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని, బోరున విలపించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

10 రోజుల తర్వాత మృతదేహం లభ్యం


బత్తల పవన్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో పది రోజుల క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం జిల్లాలో శుక్రవారం లభ్యమైంది. కర్ణాటక రాష్ట్రంలోని కుడితిని ఠాణా పరిధి తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలో ఈనెల 19న బత్తల పవన్ (22) గల్లంతయ్యాడు. అతడి మృతదేహం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద లభ్యమైంది. బంధవులు, హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన బత్తల పవన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. లారీ పని మీద కర్ణాటకకు వెళ్లాడు. ఈ 19న కుడితిని ఠాణా పరిధిలోని తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలోకి ఈత కోసం వెళ్లాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. శుక్రవారం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీలో శవమై కనిపించాడు. స్థానికులు.. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులు ఆరాతీయగా కుడితిని పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది. సమాచారం ఇవ్వడంతో కుడుతిని పోలీసులు వచ్చి, శవాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పవన్ తండ్రి పెద్దరాజు ఫిర్యాదు మేరకు కుడితిని పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారిస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

గుమ్మఘట్ట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామంలో శుక్రవారం పురుగుల మందు తాగి ముద్దులాపురం లక్ష్మి(30) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈమెకు 12 కిందట లింగప్పతో వివాహం జరిగింది. సంతానం లేకపోవడంతో తరచూ మథనపడేది. ఈక్రమంలో నే తీవ్ర మనస్తాపంతో ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఆర్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడును నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో పీఆర్ విభాగంలో ఈఈగా పని చేస్తున్న ఆయన్ను ప్రమోషన్‌పై అనంతపురం ఎస్ఈగా నియమించా రు. జూన్ ఆఖరులో అప్పటి ఎస్ఈ జహీర్ అస్లాం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఈఈగా ఉన్న ప్రభాకర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. క్లియర్ వేకెన్సీ ఉండటంతో ప్రమోషన్ కల్పించారు. కర్నూలు జిల్లాకు చెందిన చిన్న సుబ్బరాయుడు అక్కడే పీఆర్ విభాగంలో ఎక్కువ కాలం పని చేశారు. ఆయన వచ్చేనెల 3న ఎస్ఈగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

డీఐఓ బాధ్యతల స్వీకరణ


డీఐఓ దావూద్‌ను అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉర్దూ టీచర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉర్దూ మీడియం పర్యవేక్షణకు డీఐఓగా నియమితుడైన దావూద్ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉన్న ఆఫీస్‌లో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏపీటీఎఫ్ నాయకులు దావూద్‌ను కలిసి సత్కరించారు. ఉర్దూమీడియం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు సర్దార్‌వలి, రమణ, సోహెల్, మన్సూర్, బాబ్జాన్, రజాక్, అమీనుద్దీన్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సీనియర్ టెన్నికాయిట్ ఎంపిక పోటీలు ఈనెల 31వ తేదీన స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రంగస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13వ తేదీన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9652117133, 8179819416 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పారా కోర్సులతో మెండైన ఉపాధి

● రెండేళ్ల డిప్లొమాతో అవకాశం
● కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్



అనంతపురం వైద్యం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ అనుబంధంగా ఆరోగ్య సంరక్షణకు వివిధ రూపాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. వాటిని సొంతం చేసుకోవాలంటే పారా మెడికల్ సైన్స్ కోర్సులను అభ్యసించాలి. వాటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనుబంధ, ఆరోగ్య సంరక్షణ వృత్తుల మండలి(ఏపీఎస్ఏహెచ్‌పీసీ) డిప్లొమా కోర్సుల రూపంలో అందిస్తోంది. రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీఎస్ఏహెచ్‌పీసీ అనుబంధంగా ప్రభుత్వ వైద్య కళాశాల డిప్లొమా కోర్సులను అందిస్తోంది. ఇంటర్మీడియట్ బైపీసీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నోటిఫికేషన్ జారీచేశారు.

సీట్ల కేటాయింపు వివరాలు...

కోర్సు పేరు	సీట్లు
డీఎంఎల్‌టీ	30
డీఓఏ	10
డీఏఎన్ఎస్	30
డీఎంఐటీ	30
డీఈసీజీ	10
డీఆర్‌జీఏ	10
డీఆర్ఏ	10
డీఎంఎస్‌టీ	15
మొత్తం	145

రెండేళ్ల కోర్సులు

ఏపీఎస్ఏహెచ్‌పీసీ ఆధ్వర్యంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), ఆప్తాల్మిక్ అసిస్టెంట్(ఓఏ), అనస్తీషియా టెక్నీషియన్(ఏఎన్ఎస్), మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్(ఎంఐటీ), ఈసీజీ టెక్నీషియన్(ఈసీజీ), రేడియో గ్రాఫిక్ అసిస్టెంట్(ఆర్జీఏ), డార్క్‌రూమ్ అసిస్టెంట్(డీఆర్ఏ), మెడికల్ స్టెరిలేజేషన్ మేనేజ్‌మెంట్ స్టాఫ్(ఎంఎస్‌టీ) తదితర కోర్సులను అందిస్తోంది. రెండేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు వైద్యశాఖలో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ఆపరేషన్ థియేటర్లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు, నేత్ర పరీక్షల విభాగం తదితర విభాగాల్లో ఉపాధి లభిస్తుందని వివరిస్తున్నాయి.

8 వరకు దరఖాస్తులు



పారామెడికల్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు సెప్టెంబరు 8 వరకు ఉంది. ఇంటర్మీడియేట్‌లో బైపీసీ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. https://ananthapuramu.ap.gov.in/ వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తును డౌన్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తుకు, అర్హత ధ్రువపత్రాలు జతపరచాలి. వాటిని వైద్య కళాశాలలో అందజేయాలి.

-ప్రొఫెసర్ షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టుకు జయంత్


జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన జయంత్‌కృష్ణ చోటు దక్కించుకున్నాడు. శనివారం నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ టోర్నీలో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన జయంత్‌కృష్ణను పలువురు అభినందించారు.

అక్రెడిటేషన్ గడువు పొడిగింపు

అనంతపురం కలెక్టరేట్, పుట్టపర్తి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో మూడు నెలలు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా డీపీఆర్ఓ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి నవంబరు 30 వరకూ గడువు పొడిగిస్తామని వారు తెలిపారు. తమ సంస్థలలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కార్యాలయాలలో యాజమాన్యం అందజేయాలని కోరారు.

ఓరి.. నాయనో..!

● ఇంకా 50మందికిరాని మెసేజ్‌లు
● పారదర్శకత పేరుతో అభ్యర్థులతో ఆటలు
● రెండోరోజు కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

● మూడురోజులైనా పూర్తిస్థాయిలో రాని డీఎస్సీ ఎంపిక జాబితా


రెండోరోజు పీవీకేకేలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం విద్య, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియలో రాష్ట్రశాఖ కొత్తగా అమలు చేస్తున్న నిబంధనలు అభ్యర్థులను అయోమయంలోకి నెడుతున్నాయి. గతంలో డీఎస్సీ ఎంపిక జాబితాను మెరిట్, రోస్టర్ ఆధారంగా అభ్యర్థులను కూర్చోబెట్టి జిల్లాస్థాయిలో విద్యాశాఖ ఒకేసారి విడుదల చేసేది. ఆ తర్వాత సర్టిఫికెట్ల పరిశీలన చేసేవారు. అందులో ఏమైనా తేడాలుంటే వారిని జాబితా నుంచి తప్పించి, ఆ తర్వాతి స్థానంలో ఉన్న అదే రోస్టర్ పాయింట్ అభ్యర్థికి మెరిట్ ఆధారంగా కూర్చోబెట్టేవారు. ఇపుడు డీఎస్సీ సెలెక్షన్ లిస్టు మొత్తం రాష్ట్రశాఖ నుంచే తయారుచేసి పంపుతున్నారు. అదికూడా ఒకేసారి కాకుండా రోజుకు కొన్ని పంపిస్తుండడంతో అభ్యర్థుల్లో అయోమయం, ఆందోళన నెలకొన్నాయి. అనంత జిల్లాకు 807 టీచర్ పోస్టులకు జాబితా పంపాల్సి ఉంది. మూడురోజులైనా పూర్తిస్థాయి జాబితా రాలేదు. తొలిరోజు జిల్లాలో 625 మంది అభ్యర్థులకు సెలెక్టల జాబితాలో ఉన్నట్లు మెసేజ్‌లు రాష్ట్రశాఖ నుంచి పంపారు. వీరందరికీ గురువారం జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నారు. గురువారం మరో 132 మందికి మెసేజ్‌లు పంపారు. వారికి శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఈలెక్కన ఇంకా జిల్లాలో 50 మంది అభ్యర్థులకు శుక్రవారం రాత్రి వరకు మెసేజ్‌లు రాలేదు. దీంతో మెసేజ్‌లు వస్తాయా, రావా? అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మిగిలిన వారికి ఎప్పుడు మెసేజ్‌లు వస్తాయోనని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రానికి వచ్చి విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులను ప్రాధేయపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు సైతం వీటిపై క్లారిటీ ఇవ్వట్లేదు. మెసేజ్‌లు వస్తాయని చెప్పి పంపుతున్నారు. మొత్తంమీద పారదర్శకత పేరుతో రాష్ట్ర అధికారులు.. డీఎస్సీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

కొనసాగిన పరిశీలన

డీఎస్సీ సెలెక్టలిస్టులో ఉన్న అభ్యర్థులకు రాష్ట్రశాఖ మెసేజ్‌లు పంపిస్తోంది. అలా జిల్లాలో రెండురోజుల్లో 757 మందికి మెసేజ్‌లు వచ్చినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. వీరిలో గురు, శుక్రవారాల్లో 748 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారనీ, 9 మంది రాలేదన్నారు. ఈగైర్హాజరైన వారిలో కొందరు వచ్చినా వారి సర్టిఫికెట్లలో తేడాలు ఉండడంతో తీసుకురావడానికి కొందరు వెళ్లారన్నారు. మరికొందరు సమాచారం తెలీక రాలేదనీ, అలాంటి వారికి ఫోన్లు చేసి, సమాచారం ఇచ్చి పిలిపించుకుంటున్నామని డీఈఓ తెలిపారు. ఎంపిక జాబితాలో ఉన్న వారందరికీ సమాచారం ఇచ్చి, సర్టిఫికెట్ల పరిశీలనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు మిగిలిన 50మంది అభ్యర్థులకు శనివారం ఉదయంలోగా మెసేజ్‌లు వచ్చే అవకాశం ఉందనీ, రాగానే వారు పీవీకేకే కాలేజీకి వచ్చి సర్టిఫికెట్లను పరిశీలించుకోవాల్సి ఉంటుందని డీఈఓ వివరించారు.

క్రీడాకారులు రైల్వే సౌకర్యాలను వినియోగించుకోవాలి

● డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైల్వే అందజేస్తున్న క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఆటగాళ్లు తమ ప్రతిభా పాటవాలను మెరుగుపరచుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించా రు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే శాఖ ప్రజా సేవతోపాటు, క్రీడాభివృద్ధికి ఎంతో తోడ్పడుతోందన్నారు. అధునాతనమైన రైల్వే గ్రౌండు, ప్రాక్టీస్ పిచ్‌లు, జిమ్ తదితర సదుపాయాలను వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే గ్రౌండులో రైల్వేలోని వివిధ శాఖల ఉద్యోగులు క్రికెట్‌ను ఆడారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాచిగూడ-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాచిగూడ-తిరుపతి మధ్య (వయా గుంతకల్లు) ఈ నెల 29, 30 తేదీల్లో ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-తిరుపతి (02794) ప్రత్యేక రైలు ఈ నెల 29న రాత్రి 11 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1 గంటకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (02793) 30న రాత్రి 9-10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాద్గిర్, క్రిష్టా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

బిలాస్‌పూర్-యల్హంక మధ్య..

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సెప్టెంబరు 9 నుంచి నవంబరు 19 వరకూ బిలాస్‌పూర్-యల్హంక (వయా గుంతకల్లు) మధ్య ఓ ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిలాస్‌పూర్-యల్హంక ప్రత్యేక రైలు (08261) సెప్టెంబరు 9 నుంచి నవంబరు 18 వరకూ ప్రతి మంగళవారం ఉదయం 11 గంటలకు బిలాస్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు యల్హంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08262) సెప్టెంబరు 10 నుంచి నవంబరు 19 వరకూ ప్రతి బుధవారం ఉదయం రాత్రి 9 గంటలకు యల్హంకలో బయలుదేరి శుక్రవారం ఉదయం ఐదున్నరకు బిలాస్‌పూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు భటపర, రాయపూర్, దుర్గ్, రాజనంద్‌గావ్, డోంగర్‌ఘర్, గోండియా, వాడ్సా, చందఫోర్ట్, బాలార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల, ఖాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్టా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం స్టేషన్ల మీదుగా యల్హంకకు చేరుతుందన్నారు.

ప్యాసింజరు రైళ్ల రద్దు

కర్ణాటకలోని బళ్లారి, తోరణగల్లు స్టేషన్ యార్డుల్లో జరుగుతున్న ఎలెక్ట్రికల్, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ పనుల వల్ల గుంతకల్లు మీదుగా వెళ్లే పలు ప్యాసింజరు రైళ్లను రద్దు పరచినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-చిగ్జాజుర్-గుంతకల్లు ప్యాసింజరు (57415/16) రైలును సెప్టెంబరు 3న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (57405)ను సెప్టెంబరు 2న, దీని తిరుగు ప్రయాణపు రైలు (57405)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి, కేవలం గుంతకల్లు-తిరుపతి మధ్యన నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. హుబ్లి-గుంతకల్లు ప్యాసింజరు (56911) రైలును, దీని తిరుగు ప్రయాణపు రైలు (56912)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-మునీరాబాద్ సెక్షన్‌లో రద్దుపరచి, మునీరాబాద్-హుబ్లి సెక్షన్‌లో మాత్రమే నడుపుతామన్నారు. హుబ్లి-తిరుపతి (57402) ప్యాసింజరును సెప్టెంబరు 3న గంటన్నరపాటు ఆలస్యంగా నడపనున్నట్లు వివరించారు.

నాందేడ్-ధర్మవరం రైలు రద్దు

హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో వర్షపు నీరు ట్రాక్‌పై ప్రవహించిన కారణంగా నాందేడ్-ధర్మవరం-నాందేడ్ స్పెషల్ ఫేర్ ఎక్స్‌ప్రెస్‌ను ఒక ట్రిప్పు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (07189) రైలును 29న దీని తిరుగు ప్రయాణపు రైలు (07190)ను ఈ నెల 31న రద్దుపరచినట్లు తెలియజేశారు.


తెలుగు శాసనాన్ని పరిశీలిస్తున్న మైనాస్వామి, ఉపాధ్యాయులు తదితరులు

1388లోనే అచ్చమైన తెలుగు శాసనం

● విశ్లేషించిన చరిత్రకారుడు మైనాస్వామి

గోరంట్ల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరెడ్డిపల్లి సమీప పొలాల్లో 1388లోనే అచ్చమైన తెలుగు భాషలో లిఖించిన శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి విశ్లేషించారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఉపాధ్యాయులతో కలిసి శాసనంలోని అంశాలను చదివి వినిపించారు. హరిహరరాయల కుమారుడు రెండో బుక్కరాయలు సామాన్య శకం 1388లో మేరెడ్డిపల్లి ప్రజల నీటి అవసరాల కోసం, వ్యవసాయాభివృద్ధికి చెరువులు తవ్వించడం, చిత్రావతి నది నుంచి కాలువలద్వారా నీరు మళ్లించడం విషయాలు చక్కనైన తెలుగులో లిఖించారన్నారు. 1388 నాటికి తెలుగు భాష చందోబద్ధమైన పద్యాల రూపంలో గ్రాంధికంలో ఉండేదన్నారు. శాసనంలోని వచనం ఎంతో సరళంగా, అద్భుతమైన గుండ్రని అక్షరాల వరుస క్రమంలో ఉందన్నారు. శాసనంలో వాడిన పదాలను బట్టి విజయనగర సామ్రాజ్యంలో పెనుకొండ సీమలో తెలుగుభాష తేనెలా మధురంగా ఉండేదనీ, అందుకు ఈ శాసనమే సజీవ సాక్ష్యమన్నారు. రాజులు, కార్యకర్తల పేరుతరువాత గారు అని సంబోధించడం తెలుగుభాషాభివృద్ధికి నిదర్శనమన్నారు. అంతటి గొప్ప తెలుగుభాష రాసిన కర్తపేరు శాసనంలో లేకపోవడం గమనార్హం. పొలాల్లోని శాసనాన్ని మ్యూజియంకు తరలించి భద్రపరచాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, పరిశోధకులు శ్రీచరణ్, నాగభూషణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి రూ.95 లక్షల చెక్కు


చెక్కు అందజేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన అగ్నిమాపకశాఖ ఉద్యోగి కుటుంబానికి ఆ శాఖ, బ్యాంకు అధికారులు రూ. 95 లక్షల ప్రమాద బీమా డబ్బుకు సంబంధించిన చెక్కు శుక్రవారం అందించారు. జిల్లా అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న సుధాకర్ విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. అయితే అగ్నిమాపకశాఖ తమ ఉద్యోగుల ప్రయోజనార్థం బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఎంఓయూ చేసుకుంది. మరణించిన ఉద్యోగి సుధాకర్ తన శాలరీ అకౌంట్ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో ఉండటంతో రూ.95 లక్షల క్లైమ్ అయ్యింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆ బ్యాంకు డీజీఎం ప్రసాద్, ఆర్ఎం అమర్‌నాథ్‌రెడ్డి, సాయినగర్ బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అసోసియేషన్ సభ్యులు ఉద్యోగి కుటుంబానికి అందించారు.

వాటర్ షెడ్‌తో నీటి సంరక్షణ: ఏపీడీ



జ్ఞాపిక అందుకుంటున్న ఏపీడీ సుధాకర్ రెడ్డి

అనంతపురం అర్బన్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్‌తో నీటి సంరక్షణ సాధ్యమని జిల్లాకి చెందిన ఆ పథకం ఏపీడీ సుధారక్ రెడ్డి పేర్కొన్నారు. వాటర్ షెడ్ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై ఢిల్లీలోని ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఏపీ నుంచి సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం రెండో రోజు ఆయన మాట్లాడుతూ.. వాటర్ షెడ్లతో రైతులకు ఎంతో ప్రయోజనం అన్నారు. అనంత జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వాటర్ షెడ్ల నిర్వహణ తీరును వివరించినట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. ఏపీడీకి సదస్సులో ఉన్నతాధికారులు జ్ఞాపిక అందజేశారు.

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌కు నోటీసులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న వివాదంలో షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్పకు శుక్రవారం నోటీసులు అందించినట్లు తహసీల్దార్ స్వాతి తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పెనుకొండ మండలం వాసుదేవపురం రెవెన్యూ పొలంలో షిర్డీసాయి గ్లోబుల్ ట్రస్టు పేరుతో భూములు కొనుగోలుచేశారన్నారు. ఆ భూమి మధ్యలో సర్వే నంబరు 25లో 10.24 ఎకరాల్లో రాళ్లగుట్ట ఉందన్నారు. ఇందులో 7.50 ఎకరాలు ట్రస్టు ఆక్రమించుకుందన్నారు. ఇందులోనే 2.88 ఎకరాలు వెంకటలక్ష్మి నుంచి కొనుగోలు చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారనీ, అందుకు సంబంధించిన రికార్డులు 15రోజుల్లోపు అందించాలని సూచించామన్నారు. వారు స్పందించకపోవడంతో నోటీసులు పంపామన్నారు. ఐదు రోజుల్లో రెవెన్యూ యాక్ట్ ప్రకారం భూమిని స్వాధీనం చేసుకుంటామని నోటీసులో స్పష్టం చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

పామిడిలో 25.4 మి.మీ. వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 20 మండలాల్లో గురువారం వర్షం పడింది. అత్యధికంగా పామిడిలో 25.4 మి.మీ వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప 22.6, పుట్లూరు 22.2, వజ్రకరూరు 17.2, బ్రహ్మసముద్రం 15.2, బొమ్మనహాళ్ 11.0, ఉరవకొండ 10.2, కళ్యాణదుర్గం 6.8, గుమ్మఘట్ట, నార్పల 4.8, కూడేరు 4.2, మిగతా మండలాల్లో 3.8 మీ.మీ, లోపు వర్షపాతం కురిసింది.

విఘ్నరాజా నమోనమః

వినాయకచవితి సందర్భంగా అనంతపురం నగరంలో మండపాల్లో కొలువుదీరిన గణపయ్యలకు మూడోరోజు శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. నిర్వాహకులు ఉదయమే అర్చకులు చేత ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వివిధ రూపాల్లో కొలువైన వినాయక ప్రతిమలను దర్శించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.


పాతూరు బంగారు వీధిలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు


సాయినగర్ 2వ క్రాస్‌లో వినాయకుడి భుజంపై రామలక్ష్మణులు


మొదటి రోడ్డులో శివశక్తి వినాయక సర్కిల్ ఆధ్వర్యంలో ..


డ్రైవర్స్ కాలనీలో ఆకట్టుకుంటున్న సిక్స్‌ప్యాక్ వినాయకుడు


రామ్‌నగర్ అలెగ్జాండర్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో కొలువుదీరిన వినాయకుడు


రజక నగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద..

'క్రీడాలోకానికి స్ఫూర్తి ధ్యాన్‌చంద్'


ఇండోర్‌స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోచ్‌లు, క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడాలోకానికి స్ఫూర్తిప్రధాత అని శాప్ కోచ్‌లు పేర్కొన్నారు. స్థానిక డీఎ్‌సఎ ఇండోర్‌స్టేడియంలో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు, క్రీడలకు మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన సేవలను కొనియాడారు. ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ప్రతి క్రీడాకారులు క్రీడల్లో ప్రత్యేక స్థానాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియం అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎస్సై రుష్యేంద్రబాబు, కోచ్‌లు క్రీడాకారులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ ఆర్చరీ శిక్షణా శిబిరం ప్రారంభం

మేజర్ ధ్యాన్‌చంద్ పేరుతో ఆర్ట్స్ కళాశాలలో ఆర్చరీ శిక్షణా శిబిరం ప్రారంభించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ క్రీడగా ఉన్న హాకీ కోసం మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషిని కొనియాడారు. బెర్లిన్ ఒలంపిక్స్‌లో చూపిన విశేషమైన ప్రతిభా పాటవాలను వివరించారు. అనంతరం ధ్యాన్‌చంద్ పేరుతో ఆర్చరీ శిక్షణా శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ జితేంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ విష్ణు ప్రకాష్, పీడీలు శ్రీరామ్, శత్రుఘ్న, నాగేష్‌నాయక్ పాల్గొన్నారు.

మై భారత్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు సన్మానం

స్థానిక మైభారత్ కార్యాలయంలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా కేంద్ర క్రీడలు యువజన వ్యవహారాల శాఖ, మై భారత్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తమ క్రీడాకారులు, కోచ్‌లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుమునుపు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యుత్తుశాఖ విజిలెన్స్ సీఐ విశ్వ నాథ్‌చౌదరి, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, మైభారత్ ప్రోగ్రాం ఇంచార్జి గోవర్ధన్ శ్రీనివాసులు, రాష్ట్ర కోఆర్డినేటర్ భరత్, నరేంద్రమోదీ విచార్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యసౌమ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గడ్డి మందు స్వాధీనం

గార్లదిన్నె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ (గడ్డిమందు)ను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారులు పట్టుకున్నారు. నేలసారవంతం తగ్గిపోవడంతో పాటు పండ్లతోటలు దెబ్బతింటాయని ఆ మందు వాడకాన్ని ఏపీ ప్రభుత్వం నిషేధించింది. అయితే కొందరు ఆదాయం కోసం కర్నాటక రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తు లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు దృష్టి సారించి దాడులకు ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ), జీఎం అల్తాఫ్, ఇన్‌చార్జ్ ఏఈఓ శ్రీలక్ష్మి గుడ్డాలపల్లి గ్రామంలో సర్పంచు జన్నాథ్‌రెడ్డి ఇంట్లో దాడులు చేశారు. ఇందులో 5 లీటర్ల డబ్బాలు రెండు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

బై.. బై.. గణేశా

● పలు గ్రామాల్లో నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు


చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దలలో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడి విగ్రహం

(న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా గత బుధవారం కొలువుదీరిన వినాయక విగ్రహాలు మూడురోజుల పూజల అనంతరం శుక్రవారం నిమజ్జనానికి తరలాయి. అనంతపురం రూరల్‌తో పాటు శింగనమల, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, గార్లదిన్నె మండలాల్లోని గ్రామాల్లో నిమజ్జనానికి తరలించారు. ఉదయమే మండపాల వద్ద నిర్వాహకులు అర్చకుల చేత ప్రత్యేక పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం సాయంత్రం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగించారు. పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ, బాణసంచా కాల్చుతూ.. గణపతి బొప్పా మోరియా అంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం విగ్రహాలను సమీపంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలలో పోలీసుల బందోబస్తు నడుమ నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో వినాయకుడి ప్రసాదమైన లడ్డూలకు వేలంపాటలు నిర్వహించారు.


శింగనమలలో..


గార్లదిన్నెలో..


రాప్తాడు మండలం బండమీదపల్లిలో..


రాచానపల్లి వద్ద చెక్‌డ్యాంలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

క్రీడల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలి: డీఈఓ



అవార్డులను అందిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, పీవీకేకే సంస్థల డైరెక్టర్ పల్లె కిషోర్‌రెడ్డి

అనంతపురం విద్య/ అనంతపురం రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోను ప్రోత్సహించాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఉపాధ్యాయులకు సూచించారు. క్రీడా దినోత్సవ వేడుకలను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆలమూరు రోడ్డులో గల పీవీకేకే ఎంబీఏ కాలేజీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉండడంతో పాటు పిల్లలలో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అందుకే హెచ్‌ఎంలు, పీడీలు పిల్లలకు ఆటలపోటీలునిర్వహిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచించారు. తర్వాత పీవీకేకేవిద్యా సంస్థల డైరెక్టర్ పల్లె కిశోర్ మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్ ప్రతిఒక్కరూ ధ్యాన్‌చంద్ క్రీడాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గెలుపోవటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అనంతరం జిల్లాస్థాయి క్రీడలలో అత్యుత్తమ పాయింట్లు సాధించి వరుసగా ఒకటి నుంచి ఐదు స్థానాల్లో నిలిచిన నూతిమడుగు జడ్పీ ఉన్నతపాఠశాల, కొనకొండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల, బుక్కరాయసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంజేపీ పెన్నోబిళం పాఠశాల, సనప జడ్పీఉన్నతపాఠశాల హెచ్‌ఎంలు, పీడీలకు వారు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ సుగుణమ్మ,వివిద పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

తెలుగుభాష పట్ల ప్రభుత్వం వివక్ష : ఎస్‌ఎల్‌టీఏ

అనంతపురం విద్య ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపట్ల ప్రభుత్వం వివక్షత చూపుతోందంటూ తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రలాంగ్వేజస్‌టీచర్స్ అసోషియేషన్ (ఎస్ఎల్‌టీఏ) నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. జిల్లాకేంద్రంలోని ఆస్పత్రి రోడ్డులో గల తెలుగు తల్లి విగ్రహం వద్దకు వెళ్లి మీరే ప్రభుత్వాల మనసు మార్చాలని, తెలుగుభాషను కాపాడాలంటూ ఆ విగ్రహానికి వినతి చేసుకున్నారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలుగు భాష పట్ల పాలకులు వివక్షత చూపుతున్నారన్నారు. కూటమి సర్కారు తెలుగుకు ప్రాధాన్యతిస్తుందని ఆశించినా ప్రయోజనం కల్పించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రాథమిక విద్యను తెలుగుభాషలో కొనసాగించాలని, వెంటనే అధికారభాషాసంఘాన్ని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు ఆదిశేషయ్య, వేణుగోపాల్, ఆదిమూర్తి,శివమూర్తి, వలి, నాగరాజు,రాజునాయక్, విశ్వనాథరెడ్డి, స్టేట్‌ఎంప్లాయిస్ అసోషియేషన్ అధ్యక్షుడు నల్లపల్లి విజయ భాస్కర్, ఆపస్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం


కళ్యాణోత్సవం నిర్వహించిన వేదపండితులు

ఆత్మకూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో శుక్రవారం వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయంలో కట్టపై స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో కలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అంతకుమునుపు ప్రధాన అర్చకుడు రాముస్వామి.. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన జనసేన నేతలు


పవన్ కల్యాణ్‌తో టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జనసేన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశానికి హాజరయ్యేందుకు విశాఖపట్నం వెళ్లిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా చెర్మన్ వరుణ్, రాయలసీమ రీజి యన్ మహిళా కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత డిప్యూ టీ సీఎం, పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పార్టీ కార్యకలాపాల గురించి ఆయన చర్చించినట్లు వారు తెలిపారు.

నేడు పల్లె ఉమ వర్ధంతి

● ఏర్పాట్లను ప్రారంభించిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి


ఏర్పాట్లను ప్రారంభిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

అనంతపురంరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా వర్ధంతిని శనివారం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పల్లె రఘునాథరెడ్డి కక్కలపల్లి సమీపంలోగల తమ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు హాజరు కానున్నారు. అన్నదానం, రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మదేశ్వర్‌రెడ్డి, రమేష్‌బాబు, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 420 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరసరా ధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,225 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

సచివాలయాల తనిఖీ

నార్పల,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి):మండలంలోని నాయనపల్లి, వెంకటాంపల్లి గ్రామాలలో సచివాలయాలను ఎంపీడీఓ మమతాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే వెంకటాంపల్లిలో చెత్తసంపద తయారీకేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయసిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జన వేడుకల్లో వివాదాలు

గార్లదిన్నె, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) వినాయక నిమజ్జనోత్సవంలో చిన్నపాటి ఘర్షణ జరిగింది. శుక్రవారం గార్లదిన్నె పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తుండగా రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఒక వర్గం యువకులను దూషించారని మరో వర్గం వారు దాడి చేశారు. దీంతో ప్రతి దాడి కోసం సిద్ధం కావడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్ మహ్మద్ గౌస్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కల్లూరులో ఒక విగ్రహానికి ఐదు రోజులు అనుమతి ఇవ్వడం, మిగిలిన విగ్రహాలను శుక్రవారమే నిమజ్జనం చేయమనడంతో వివావాదం తలెత్తింది. నీలం సంజీవరెడ్డి సర్కిల్‌లో మిగిలిన కమిటీల వారు ఆందోళనకు దిగారు. దీంతో డీఎస్పీ అక్కడికి చేరుకుని అన్ని విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు చేపట్టారు.

చెరువు కట్టపై నిమజ్జనానికి ఏర్పాట్లు

బుక్కరాయసముద్రం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కొలువుదీరిన గణేషుడి విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేసేందుకు బుక్కరాయసముద్రం చెరువు కట్టపై అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుక్కరాయసముద్రం తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, అనంతపురం తహసీల్దార్ హరిప్రసాద్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో ఉన్న గోశాల వద్ద నిమజ్జనం చేసేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేపట్టారు. అనంతపురంలోని హౌసింగ్ బోర్డు, బుడ్డప్పనగర్ ఓల్డ్‌టౌన్, ఉమానగర్, అంబేడ్కర్ నగర్, వన్‌టౌన్ పరిధిలోని కాలనీలు, బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీకి సంబధించిన గణపతి విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు


రక్తదానం చేసిన వారికి ప్రసంసా పత్రం అందజేస్తున్న కనగానపల్లి టీడీపీ నాయకులు

కనగానపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర జయంతిని పురస్కరించుకుని రామగిరిలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో కనగానపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున ఆయన అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. అందుకుగాను వారికి టీడీపీ నాయకులు ప్రసంసాపత్రాలు అందజేశారు.

'చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇస్తాం'


సమావేశంలో మాట్లాడుతున్న డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు

గార్లదిన్నె, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు సాగునీటిని విడుదల చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన డబ్ల్యూఎస్ ప్రెసిడెంట్లు, టీసీ మెంబర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతాంగాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది సాగునీటిని చివరి ఆయకట్టు వరకు అందించనుందన్నారు. త్వరలోనే ఎంపీఆర్ డ్యాం ద్వారా అన్ని చెరువులకు నీరు నింపుతామన్నారు. డీసీ వైస్ ప్రెసిడెంట్ చంద్రాయుడు, డీఈ చంద్రశేఖర్, జేఈలు శంకర్, సురేంద్రరెడ్డి, అరుణ, డబ్ల్యూఎస్ ప్రెసిడెంట్లు, టీసీ మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.


'ఆరేళ్లలో ఎందుకు పోటీ చేయలేదు?'


అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమైక్య తెలుగు రాజ్యం రాజకీయ పార్టీ చివరి ఆరు సంవత్సరాలలో ఎందుకు పోటీ చేయలేదో వివరణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం నోటీసు జారీ చేశారు. 2019 నుంచి ఎన్నికల్లో ఎందుకు పోటీచేయలేదనే కారణాన్ని రాత పూర్వకంగా రాష్ట్ర ఎన్నికల అధికారికి ఈనెల 28వతేదీలోపు సమర్పించాలన్నారు. సెప్టెంబరు 8వతేదీ సమైక్య తెలుగు రాజ్యం రాజకీయపార్టీ అధ్యక్షులు కానీ సెక్రటరీ కానీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎదుట హాజరు కావాలన్నారు. లేనిపక్షంలో ఈ పార్టీని నమోదైన రాజకీయ పార్టీల జాబితా నుంచి తీసివేయటం జరుగుతుందని నోటీసులో పేర్కొన్నారు.


ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


జేఎన్‌టీయూలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, ఓఎస్‌డీ, డైరెక్టర్లు

(న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా పితామహుడు గిడుగురామమూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తర్వాత వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన సేవల్ని కొనియాడారు. అలాగే మాతృభాష అయిన తెలుగును మరువరాదన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో వీసీ సుదర్శనరావు, ఓఎ్‌సడీ దేవన్న, డైరెక్టర్లు ఇతర అధికారులు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటుకలపల్లి గ్రామ సమీపంలో గల అనంతలక్ష్మి పాఠశాలలో, కొడిమి గ్రామ సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ పాఠశాల, ఆత్మకూరు మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు కవులు, పండితులు, శ్రీకృష్ణదేవరాయల వేషధారణలతో అలరించారు. అలాగే తెలుగు పద్యాలు వల్లెవేసి, నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. నార్పల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బాలప్ప తెలుగు ప్రాముఖ్యత, నైపుణ్యతను, తియ్యదనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతపురం నగరంలోని అంబేడ్కర్‌రోడ్డులోని తెలుగుతల్లి విగ్రహానికి నగర మేయర్ మహ్మద్ వసీం పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


అనంతలక్ష్మి పాఠశాలలో వివిధ వేషధారణలలో విద్యార్థులు


ఎరా స్కూల్‌లో గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


ఆత్మకూరు జడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

అనంతపురం శాఖ(code-1281),ఎస్.జె.టవర్స్, విద్యుత్ నగర్ సర్కిల్, అనంతపురము,
ఫోన్:08554-246650, Email Id: iob1281@iob.in

ఋణగ్రహీతలు/తనఖాదారులు/చట్టబద్ధవారసులు/హామీదారులకు డిమాండ్ నోటీసు

SARFAESI చట్టం 2002 లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్(2) క్రింద

ప్రదేశము: అనంతపురము
తేది:13.08.2025

ఋణగ్రస్తులు:
1.శ్రీ జాఫర్ వలి కనిశెట్టిపల్లి, (తండ్రి) దివంగత శ్రీ కనిశెట్టిపల్లి సాదక్ వలికి చెందిన న్యాయవారసులు, శాశ్వత చిరునామా: డోర్.నెం.11-2-46, క్రిష్ణదేవరాయ నగర్, అనంతపురము, ఆంధ్రప్రదేశ్-515001 సంప్రదించవలసిన చిరునామా: ఫ్లాట్ నెం.6, 5వ ఫ్లోరు, సన్‌రైజ్ అపార్ట్‌మెంట్స్, అరవిందనగర్, అనంతపురము, ఆంధ్రప్రదేశ్-515001
2.శ్రీమతి మహబూబ్ బీ, (తల్లి) దివంగత శ్రీ కనిశెట్టిపల్లి సాదక్ వలికి చెందిన న్యాయవారసులు, శాశ్వత చిరునామా: డోర్.నెం.11-2-46, క్రిష్ణదేవరాయ నగర్, అనంతపురము, ఆంధ్రప్రదేశ్-515001 సంప్రదించవలసిన చిరునామా: ఫ్లాట్ నెం.6, 5వ ఫ్లోరు, సన్‌రైజ్ అపార్ట్‌మెంట్స్, అరవిందనగర్, అనంతపురము, ఆంధ్రప్రదేశ్-515001
3.శ్రీమతి షబానా బేగమ్ మొల్లి (భార్య) దివంగత శ్రీ కనిశెట్టిపల్లి సాదక్ వలికి చెందిన న్యాయవారసులు, శాశ్వత చిరునామా: డోర్.నెం.11-2-46, క్రిష్ణదేవరాయ నగర్, అనంతపురము, ఆంధ్రప్రదేశ్-515001 సంప్రదించవలసిన చిరునామా: ఫ్లాట్ నెం.6, 5వ ఫ్లోరు, సన్‌రైజ్ అపార్ట్‌మెంట్స్, అరవిందనగర్,అనంతపురము, ఆంధ్రప్రదేశ్-515001.

అయ్యా/అమ్మా, విషయం:- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, అనంతపురము శాఖ వారివద్ద మీ క్రెడిట్ సౌకర్యం గురించి
1. పై పేర్లలో పేర్కొనబడిన మీరు, మాబ్యాంక్ ఋణగ్రహీతలు, మీరు మా అనంతపురము శాఖ నుండి ఈ క్రింది క్రెడిట్ సదుపాయాన్ని పొందారు: బకాయిలు ఉన్న క్రెడిట్ సదుపాయం వివరములు క్రింది విధముగా ఉన్నాయి.

క్రెడిట్ సౌకర్యం	పరిధి	వడ్డీ రేట్లు (ఓవర్ డ్యూ వడ్డీ) (మిగిలిన వాటితో సహా)	చివరి వడ్డీ డెబిట్ తేది (తప్పనిసరి)	మొత్తం బకాయి * తేది: 13.08.2025 నాటికి(రూ॥లలో)
HL-128103464000038	Rs.32,00,000/-	10.65%	08.07.2025	32,00,408.55
Total	32,00,000.00			32,00,408.55

* పైన పేర్కొన్న తేదీ నుండి తిరిగి చెల్లింపు చేసే తేదీ వరకు ఒప్పంద రేటు/ మిగిలిన తదుపరి వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది. క్రెడిట్ సౌకర్యాలు క్రింద పేర్కొన్న ఆస్తులపై మార్టిగేజ్/హైపొతికేషన్/ హైర్ పర్చేస్/లీజ్ (అన్వయించునపుడు) ద్వారా భద్రపరచబడ్డాయి. ఈ ఆస్తులు దివంగత శ్రీ కనిశెట్టి సాదక్ వలిగారి పేరు మీద ఉన్నవి. అనంతరము శ్రీ కనిశెట్టి సాదక్ వలి గారు మరణించగా వారసులుగా 1) తండ్రి 2) తల్లి 3) భార్య ను ఉంచినారు. వీరే ఇపుడు మార్టిగేజ్ చేయబడిన ఆస్తిని వారసత్వంగా పొందుతారు. అదనంగా పైన సూచించిన క్రమ సంఖ్య 1,2,3 లోని ఆస్తులు కూడా మార్టిగేజ్ ద్వారా భద్రపరచబడ్డాయి.
1. పైన పేర్కొన్న బాకీలను మీరు కాలానుగుణంగా అమలు చేసిన వివిధ పత్రాల ద్వారా అంగీకరించారు.
2.బ్యాంక్ వారి తరుపున పైన తెలిపిన క్రెడిట్ సౌకర్యములకు తనఖాగా ఉంచిన వాటి వివరములు.

తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు సరిహద్దులతో.

సన్‌రైజ్ అపార్ట్‌మెంట్స్‌లో 5వ అంతస్తులోని నివాస ఫ్లాట్ నెం.6, విస్తీర్ణం 1125 చ॥అ॥లు (సామూహిక ప్రదేశాలు సహా) 976.48 చ॥గు॥లు ఇందులో విభజించని 28 చ॥గు॥ల భూమి వాటా కలదు. ఈ ఆస్తి అనంతపురము ఆర్.డి మరియు ఎస్.ఆర్.డి పరిధిలో, అనంతపురము మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతము, వార్డు నెం.11, అరవిందనగర్, ఫ్లాట్ నెం.109 మరియు 110 లో, టి.ఎస్. నెం.2678/1, 2678/2 నందు కలదు. దీని సరిహద్దులు: స్థలమునకు హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.111, డోర్.నెం.11/977 నందు వై. సోమయ్యకు చెందిన ఇల్లు, పడమర: ప్లాటు నెం. 108, ఉత్తరము: డోర్ .నెం.11/949 నందు శ్రీ జాకబ్ దానియల్‌కు చెందిన ఇల్లు, దక్షిణము:40 అడుగుల రోడ్డు. 5వ ఫ్లోరు నందలి 6వ నెంబరు ఫ్లాటుకు హద్దులు: తూర్పు : 5వ ఫ్లోర్ కారిడార్, పడమర: ఫ్లాట్ నెం.108, ఉత్తరము: డోర్ .నెం.11/949 నందు శ్రీ జాకబ్ దానియల్‌కు చెందిన ఇల్లు, దక్షిణము: ఫ్లాటు నెం.5, 5వ ఫ్లోరు నందు.

3. ప్రధాన రుణం/వడ్డీని చెల్లించడంలో ఎగవేతల ఫలితంగా, పైన పేర్కొన్న ఋణగ్రహీతలు అంగీకరించిన నిబంధనల ప్రకారం పేర్కొన్న రుణ ఖాతా తేది.08.07.2025న ఎన్.పి.ఏగా వర్గీకరించబడినది. రిజర్వు బ్యాంక్ మార్గదర్శకాలు మరియు ఆదేశాలు ప్రకారం మొండి బకాయిలుగా వర్గీకరించబడింది. మీఖాతాను క్రమబద్ధీకరించడానికి ఎప్పటికప్పుడు మా ద్వారా రిమైండర్‌లు పంపినప్పటికీ, మీరు వడ్డీతో సహా రుణ ఖాతాలో గడువు మీరిన బకాయిలని తిరిగి చెల్లించలేదు.
4. శ్రీ కనిశెట్టిపల్లి సాదక్ వలి గారు మరణించారని మేము అర్థంచేసుకున్నాము. దివంగత శ్రీ కనిశెట్టి పల్లి సాదక్ వలి గారి వారసులైన పై క్రమ సంఖ్య1,2 మరియు 3 లలో పేర్కొన్న న్యాయవారసులు పైన తెలిపిన క్రెడిట్ సౌకర్యాలకు సంబంధించిన బాకీలను తీర్చడంలో విఫలమయ్యారు.దీని కారణంగా మీ ఖాతా ఎన్.పి.ఎ గా వర్గీకరించబడినది. అందువలన మేము మా రుణాలను క్రమ సంఖ్య 1,2,3లో పేర్కొన్న మీకు రీకాల్ చేస్తూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 1లోని సబ్-సెక్షన్ (2) క్రింద మీకు నోటీసు పంపడమైనది మరియు మీ బకాయిలను పూర్తిగా చెల్లించమని మరియు మీ రుణ బాధ్యతను పూర్తి చేయమని మిమ్మల్ని కోరడమైనది ఈ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులు లోపు పై పేరా 1 నుండి 4 వరకు వివరించిన విధంగా, తదుపరి వడ్డీ పైన పేర్కొన్న తేదీ నుండి, అంగీకరించిన విధంగా నెలవారీ వడ్డీతో కలిపి మొత్తం రూ॥32,00,408.55 చెల్లించవలసినదిగా కోరడమైనది.
5. పైన పేర్కొన్న సీరియల్ నెంబరు. 1,2,3 అనువారు వారసులు కావున, అప్పుదారులుగా పరిగణించబడి క్రెడిట్ సౌకర్యాలను వారు స్వీకరించారు మరియు ఆ క్రెడిట్ సౌకర్యాలకు బదులుగా పైన పేర్కొన్న ఆస్తులను తాకట్టు పెట్టారు. ఋణగ్రస్తుడు/వారసులు తిరిగి చెల్లింపులో డీఫాల్ట్ చేసినందున తాకట్టు పెట్టినవారు/ హామీదారులు/న్యాయవారసులు గ్యారంటీ ప్రకారము బ్యాంక్‌కు బకాయి మొత్తం రూ॥32,00,408.55 తో పాటు, అంగీకరించినట్లుగా నెలవారీ/అర్ధవార్షిక వడ్డీ సహా, చెల్లించవలసి ఉంటుంది. కావున SARFAESI చట్టం ప్రకారం మీరు ఇచ్చిన వ్యవసాయేతర సెక్యూరిటీల ఆధారంగా గ్యారంటీని అమలు పరుస్తూ, ఈ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు [illegible]

[illegible]

అధీకృత అధికారి,
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, అనంతపురము శాఖ.

చల్లగా వెళ్లిరా స్వామీ...


రాయదుర్గంలో గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న బాలిక


పామిడిలో నిమజ్జనానికి వెళ్తున్న స్వాములు


రాయదుర్గం నాన్‌చెరువులో..


పెద్దవడుగూరు: నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు

వక్రతుండా.. నీవే అండ

పార్వతీతనయుడికి విశేష పూజలు

పలు ప్రాంతాల్లో నిమజ్జనం


ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: వినాయక చవితిని పురష్కరించుకొని మూడో రోజైన శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు పిండివంటలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. విఘ్నాలన్నీ తొలగించి నీవే ఆదుకోవాలని ప్రార్థించారు. కాగా, పలు ప్రాంతాల్లో శుక్రవారం నిమజ్జనం చేశారు. స్వామి వారిని భారీగా ఊరేగించి.. భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికి.. గంగమ్మ ఒడిలోకి చేర్చారు. మరి కొన్ని ప్రాంతాల్లో ఐదో రోజైన ఆదివారం నిమజ్జనం చేయనున్నారు.


గుత్తి మండలం తొండపాడులో ..


తాడిపత్రి మెయిన్ బజారులో ఆపరేషన్ సిందూర్ వినాయకుడు


గుంతకల్లులో సుబ్రహ్మణేశ్వర స్వామి అలంకరణలో..


రాయదుర్గం ఓబుళాచారి రోడ్డులో కాణిపాకం వినాయకుడిగా..


ఛత్రపతి శివాజీ ఒడిలో..


ఉరవకొండలో భారీ ఊరేగింపుగా..


బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్ క్రాస్‌లో..


విడపనకల్లులోని రంగస్వామి దేవాలయం వద్ద..


గుత్తి రెడ్డివీధిలో పర్యావరణ ప్రేమికుడిగా..


పామిడి తగ్గుదేవాలయంలో..


తాడిపత్రి సంజీవనగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన బాలవినాయకుడు


కూడేరు మండలం కమ్మూరు గ్రామంలో....


బెళుగుప్పలో...


రాయదుర్గం పట్టణంలో ...


తాడిపత్రిలో...


పామిడి చరిత్రను తెలియజేసేలా...

నోరు అదుపులో పెట్టుకో

తలారి రంగయ్యకు టీడీపీ నాయకుల వార్నింగ్


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్య నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీడీపీ సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రజావేదిక వద్ద వారు మీడియాతో మాట్లాడారు. తలారి రంగయ్య ఓ చదువుకున్న అజ్ఞానిలా.. దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి ఇకనైనా మానుకోకపోతే గ్రామాల్లో తలారి రంగయ్యను తిరగకుండా ప్రజలే అడ్డుకుంటారని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాటి మంత్రి ఉషశ్రీచరణ్ నియోజకవర్గాన్ని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేసిందన్నారు. నాడు ఎంపీగా ఉన్న తలారి రంగయ్య ఏ నాడూ దుర్గం వైపు కన్నెత్తి చూడలేదన్నారు. నేడు లేనిపోని ఆరోపణలు చేస్తూ.. అభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ. కోటతో అభివృద్ధి పనులు చేపట్టారని, తన సొంత నిధులతో బీటీపీ కాలువ పనులు ప్రారంభించారని అన్నారు. సమావేశంలో మాజీ సర్పంచు గాజుల శ్రీరాములు, మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మీదేవి, మండల కన్వీనర్లు పాలబండ్ల శ్రీరాములు, గోళ్ల వెంకటేశులు, ధనుంజయ, శివన్న, టీఆర్ తిప్పేస్వామి, రామరాజు, శర్మాస్ వలీ, పాపంపల్లి రామాంజినేయులు, టీడీపీ నాయకులు దండా వెంకటేశులు, ఆవుల తిప్పేస్వామి, డిష్ మురళి, నగేశ్, గురుప్రసాద్, కొల్లాపురప్ప, హనుమంతరాయుడు, బొజ్జన్న, లాల్ క్రిష్ణ, నారాయణ, సునీల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేయాల్సిందే

యాడికి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామపంచాయతీలో గొర్రెల సంతను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించుకోవడం, గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి .. అవినీతిపరులపై చర్యలు తీసుకోవాల్సిందేనని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల వీరు అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర ఫిర్యాదు చేసిన సీపీఐ నాయకులు వడ్డెరాముడు, గరిడి శివన్న, బండారు రాఘవను యాడికి గ్రామ పంచాయతీ కార్యాలయానికి పిలిపించారు. విచారణ పూర్తి అయిందంటూ ఎండార్స్‌మెంట్‌పై సంతకాలు చేయాలని ఆ నాయకులను జూనియర్ అసిస్టెంట్ కోరారు. దానికి వారు ససేమిరా అన్నారు. ఫిర్యాదుపై విచారణే చేపట్టలేదని, అవినీతిపరులపై చర్యలూ తీసుకోలేదని, దీంతో తాము సంతకాలు చేసే ప్రశక్తే లేదని తేల్చిచెప్పారు. ఇష్టానుసారంగా ఎండార్స్‌మెంట్ రాసుకొని సంతకం పెట్టమంటే ఎలా పెడతామని నిలదీశారు. ప్రైవేట్ వ్యక్తులు గ్రామపంచాయతీ ఆదాయాన్ని, నిధులను మింగేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రైవేట్ వ్యక్తులు గొర్రెల సంతను ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ అధికారులు గానీ మార్కెట్‌యార్డు అధికారులు గానీ ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఇచ్చిన ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకోవాల్సిందేనని తెగేసి చెప్పారు. సమస్య పరిష్కారం కాకపోతే మరళా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు.


జూనియర్ అసిస్టెంట్‌తో వాదిస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీనృసింహుడికి పూజలు

తాడిపత్రి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామసమీపంలోని ఓబులేసుకోనలో స్వాతి నక్షత్రం పురష్కరించుకొని శుక్రవారం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

వైసీపీ నాయకులకు పరామర్శ

తాడిపత్రి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ సీనియర్ నాయకుడు పేరం నాగిరెడ్డి, వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలతను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మోకాలు ఆపరేషన్ చేయించుకున్న పేరం నాగిరెడ్డిని, అస్వస్థతకు గురై శస్త్రచికిత్స చేయించుకున్న పేరం స్వర్ణలత వారివారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తాడిపత్రి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వాసుప్రకాష్, ఎస్ఐ నరేంద్రభూపతి, డీసీటీఓ రమేష్, వ్యవసాయాధికారి ఆంజనేయులు శుక్రవారం తనిఖీచేశారు. భవానీ ఫర్టిలైజర్స్ షాపులో రూ.3,98,600, మాకం ఫర్టిలైజర్స్ షాపులో రూ.74 వేలు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో 1,98,650 విలువగల స్టాక్ అమ్మకాలు నిలుపుదల చేశారు.

బాల్య వివాహాలను అరికడదాం


పోస్టర్‌ను విడుదల చేస్తున్న న్యాయాధికారి

కూడేరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం కూడేరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ లాయర్లు మహేష్, అనుష విజయదుర్గ, ఆర్ఎంహెచ్ఓ హేమలత, ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ సురేష్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనం గా నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్, హ్యాండ్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణించిన 28 మంది క్రీడాకారులకు ధ్రువపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, పీడీ మహబుబ్‌బాషా, అధ్యాపకులు టీ వెంకటరమణ, శివయ్య, నాగార్జున పాల్గొన్నారు.

● ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల, సెంట్రల్ ఉన్నత పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వరి, పీఈటీలు మారుతి, రాఘవేంద్ర, మంజునాథ్, డిగ్రీ కళాశాల పీడీ ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుల ఎంపిక

గుంతకల్లుటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా గుంతకల్లు పట్టణానికి చెందిన బీ గోవిందు, మురళీకృష్ణ నియమితులైనట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో వారు మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను నిర్వహించామని, అందులో వీరిని రాష్ట్ర సమితి సభ్యులుగా నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు దాసరిశ్రీనివాసులు, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

మారిన కాంగ్రెస్ కమిటీల జాబితా

గుంతకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కాంగ్రెస్ మండల, పట్టణ కమిటీల జాబితా మారింది. గుంతకల్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్‌కు, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డికి మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. గత సోమవారం డీసీసీ అధ్యక్షుడు ఓ జాబితాను విడుదల చేసిన విషయం తెల్సిందే. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనుమతి ఇచ్చారంటూ దౌల్తాపురం ప్రభాకర్ శుక్రవారం మరో జాబితాను ప్రకటించారు. గుంతకల్లు పట్టణ అధ్యక్షుడిగా టీ రామాంజనేయులు, గుత్తి పట్టణ అధ్యక్షుడిగా షేక్ సిరాజుద్దీన్, పామిడి పట్టణ అధ్యక్షుడిగా మునీర్ గౌస్‌పీరా పేర్లతో కమిటీలను ప్రకటించారు.

వెండి గిన్నె వితరణ

తాడిపత్రి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుషాపు యజమానులు నజీర్, నూర్ దాదాపు లక్ష రూపాయలు విలువజేసే వెండి గిన్నెను శివసాయి బాబా ఆలయానికి శుక్రవారం అందజేశారు. ఆలయ అర్చకుడు మారుతిప్రసాద్ వారిని సన్మానించారు.

దర్శించుకున్న మాజీ ఎంపీ..: మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సంజీవనగర్‌లో నాల్గో రోడ్డులోని శివసాయిబాబాను శుక్రవారం దర్శించుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడడంతో సాయిబాబాను దర్శించుకొని పూజలు నిర్వహించారు.


వెండి గిన్నెను అందజేస్తున్న నజీర్, నూర్

చెక్కుల పంపిణీ

ఉరవకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలానికి చెందిన 14 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద 6.85 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు అనంతపురంలోని ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో బాధితులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొనుగుంట్ల నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ నాగన్న, మోహన్‌రావు పాల్గొన్నారు.

● విడపనకల్లు: మండలంలోని పలువురు బాధితులకు టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను అందించారు.

మున్సిపాల్టీకి బకాయి చెల్లింపు

గుత్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య సంఘానికి సంబంధించిన కల్యాణ మండపం, తదితర వాటికి సంబంధించి మున్సిపాల్టీకి రూ.1.39 లక్షలు పన్నులు బకాయి ఉంది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్‌ను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాకం శ్రీకాంత్, కార్యదర్శి కలుగొట్ల కిషోర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జబ్బర్‌మీయాకు శుక్రవారం అందజేశారు. ప్రజలందరూ సకాలంలో పన్నులు చెల్లించి.. అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

బహుమతుల అందజేత

బెళుగుప్ప, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం టెన్త్‌లో ఈశ్వరి, మధుశ్రీ 550 మార్కులు పైగా సాధించారు. దీంతో వారికి ఎస్ఐ శివ ప్రోత్సాహక నగదు బహుమతిగా ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున వారి కుటుంబ సభ్యులుకు శుక్రవారం అందజేశారు. ఇందులో ఎంఈఓ హరికృష్ణ, ట్రైనీ ఎస్ఐ మహేష్, హెచ్‌ఎం వెంకటస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ రుద్రయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షఫీ



గుత్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ ప్రొటక్షన్ కమిషన్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన వ్యాపార వేత్త దాండియా మహమ్మద్ షఫిని నియమించారు. ఈ మేరకు ఆ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు హాజీ మహ్మద్ ముజాహిద్, నేషనల్ చైర్మన్ సోహెబ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరికి గాయాలు

పుట్లూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మనమలలో శుక్రవారం వినాయక విగ్రహం నిమజ్జనానికి తరలించే సమయంలో అపశ్రుతి జరిగింది. నిమజ్జనానికి తరలించే సమయంలో క్రేన్‌తో విగ్రహాన్ని ఎత్తే సమయంలో రోప్ పక్కకి పోయి విగ్రహం కిందపడింది. దీంతో శ్రీనివాసులు, నాగార్జున స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ..

బెళుగుప్ప, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హిందూపురానికి చెందిన ఎల్ఐసీ అధికారి రామకృష్ణ తమ కుటుంబసభ్యులతో కలిసి కారులో రాయదుర్గం బయలుదేరాడు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో వెళ్తున్న ఈ కారును ఓ ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి.

రెండు బైక్‌లు ఢీ

పుట్లూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లుట్ల గ్రామ శివారులో శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఎల్లుట్ల గ్రామానికి చెందిన బాలాజీ నార్పలకు బైక్‌పై బయలుదేరాడు. మడుగుపల్లికొండలో బైక్ రైడింగ్‌కి వెళ్లాల్సిన బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి దారి తప్పి ఎల్లుట్ల వైపు వచ్చాడు. ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో బాలాజీ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

బెళుగుప్ప, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస విద్యానికేతన్‌లో తెలుగు భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు వేషధారణలో విద్యార్థి ఆకట్టుకున్నాడు. కరెస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుమ ఇందులో పాల్గొన్నారు.

● కుందుర్పి : మండలంలో అపిలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తిమ్మప్ప ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

● ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషాదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ, లయన్స్‌క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ, వేదమూర్తి, గణేష్‌బాబు, ప్రభాకర్ నాయకులు, అధ్యాపకులు పరమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి, తెలుగుభాష దినోత్సవాన్ని స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లపదాలను ఉపయోగించకుండా తెలుగులోనే మాట్లాడే పోటీ ఆసక్తిగా సాగింది.



ఉరవకొండలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు, కుందుర్పిలో నివాళులర్పిస్తున్న టీచర్లు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

గుంతకల్లుటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో అవోపా వినాయక ఉత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో మహాగణపతి సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వెండి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య గాయని వాసవి సిస్టర్స్ దిదేషిమణి, పామిడి నాగమణి మనోహర్, ఆ సమితి అధ్యక్షుడు ఇనుగూరు శంకర్‌నారాయణ, సెక్రెటరీ పువ్వాడి శ్రీనివాసులు, కోశాధికారి ఎస్ఎంకే లక్ష్మీనారాయణ, సలహాదారు మిట్లా లోకేంద్రనాథ్, జయంతివెంకట్, ఇనుగూరు సుబ్బయ్య పాల్గొన్నారు.